
# సహ అభ్యర్థి

— కె. శారద



"పోస్ట్"

ఆత్రుతగా వెళ్లి కవరు అందుకున్నాడు రామనాథం. 'ఫ్రం' అడ్రస్ చూశాడు. ఆనందంతో 'ఆహా! కరుణించెనే కమలాక్షుడు' అని పాడుతూ కవరు తెరిచిచూశాడు. తను ఉద్యోగం కోసం దరఖాస్తు పంపిన 'హరిశ్చంద్ర అండ్ కంపెనీ' నుంచి సేల్స్ మన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది. తారీఖు చూశాడు. బుధవారం ఉదయం 10.30కు. అంటే ఇంకో రెండురోజులుందన్నమాట!

'ఇన్నాళ్లుగా ఉద్యోగం కోసం ఎదురుచూసి చూసి కళ్లు వాచిపోయాయి. కనీసం ఒక్క ఇంటర్వ్యూకూ పిలుపు రాలేదు. భగవంతుని దయవలన ఈ ఉద్యోగమన్నా వస్తే తనకెంతో మేలుజరుగుతుంది. ఊర్లో తల్లితండ్రీ, పెళ్లికెదిగిన చెల్లెలు, చదువుకుంటున్న తమ్ముడు - అందరూ తన ఉద్యోగం మీదే ఆశలు పెట్టుకున్నారు. కానీ తను? తన మిత్రుడు రామచంద్రం గదిలో వుంటూ అతని దయతో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈసారైనా....'

ఆలోచనలతో సతమతమవుతున్న రామనాథం, రామచంద్రం రాకను గమనించలేదు.

"హాయ్! రామ్‌నాథ్! ఏమిటా దీర్ఘాలోచన" అని రామచంద్రం తన భుజాన్ని తట్టగానే ఉలిక్కిపడ్డాడు రామనాథం.

"అబ్బే... ఏం.... ఏంలేదు - నాకు ఉద్యోగం... అదే 'హరిశ్చంద్ర అండ్ కంపెనీ'కి మనిద్దరం అప్లై చేశాం చూశావూ. దానికి రేపు బుధవారం 10.30కి ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చింది." గుక్క తిప్పుకోకుండా సంతోషంగా చెప్పాడు రామనాథం.

"అవునా! చాలా సంతోషం! ఏదీ ఇంటర్వ్యూ కార్డు" అంటూ రామనాథం అందించిన కవరు చూశాడు రామచంద్రం. 'అరె! ఇది తనకు వచ్చిన కవరే! రామనాథం చూడలేదా! లేక తనను ఎగతాళి చేస్తున్నాడా! అనుకుని

"లేదు రామనాథం! కవరుపై నీపేరు లేదు. నాపేరుంది! సరిగ్గా చూడు" అన్నాడు రామచంద్రం.

"ఔనా!" ఆశ్చర్యంగా అంటూ కవరూ, లోపలి ఉత్తరం మరో మారు చూశాడు రామనాథం! 'ప్చ్! ఫ్రం' అడ్రస్ చూడగానే, పైపేరు చూడకుండా ఆత్రుతగా కవర్ చించాడు. రామనాథం, రామచంద్రం పేర్లలో వున్న సామీప్యం అదృష్టంలో లేదు! నిజమే! అదృష్టం రామచంద్రాన్నే వరించింది! తనకు ఉద్యోగం కాదుగదా, ఇంటర్వ్యూ వచ్చే అవకాశం కూడా లేదా! ప్చ్! ఇంకా ఇలా ఎన్నాళ్లు [illegible]'

రామనాథం పరిస్థితి చూసి జాలేసింది రామచంద్రానికి. 'తన క్వాలిఫికేషన్ కేవలం బి.ఏ. రామనాథం చదివింది ఎం.ఏ. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగే! కానీ రామనాథం కుటుంబం అతని ఉద్యోగం కోసం ఎదురు తెన్నులు చూస్తోంది. తనకు అవసరానికో ఉద్యోగమన్నా వుంది! కాకపోతే మరో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు.

సేల్స్‌మన్ ఉద్యోగాలూ తనకు కొత్తకాదు. కొంత కాలం చేసినవే పైగా ఈ సేల్స్‌మన్ ఉద్యోగం వలన తనకు పెద్దగా లాభించదు. పోనీ ఇది రామనాథానికి వస్తే... అయినా తన పిచ్చిగానీ ఇది ఉద్యోగానికి పిలుపు కాదుగా! కేవలం ఇంటర్వ్యూ! పైగా ఆ కంపెనీలో తనకు తెలిసిన వారెవరూ లేరు. రామనాథానికి ఎలా సాయపడాలి! అతనీ ఇంటర్వ్యూకెళ్తే... ఆ తర్వాత అతని అదృష్టం!

దీర్ఘంగా ఆలోచించిన రామచంద్రం ఒక నిర్ణయా

నికి వచ్చాడు.

"చూడు రామనాథం! నాకెలాగూ ఒక ఉద్యోగం వుంది! ఏదో గడిచిపోతోంది! నాకు మంచి ఉద్యోగం వస్తే ఎలాగూ వెళ్లిపోతాను. ఈ ఉద్యోగం నీకు దొర్కితే చాలా బాగుంటుంది! ఇప్పుడెలాగూ నాకు ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది! నువ్వు నా సర్టిఫికేట్లు తీసుకుని 'రామచంద్రం' అని చెప్పు. నా వివరాలన్నీ గుర్తు పెట్టుకో! ఇంటర్వ్యూ మాత్రం బాగా చేయి! విష్‌యు బెస్ట్ ఆఫ్ లక్!" అన్నాడు.

"నో... నో.... వద్దు రామచంద్రం! రేపు నిజం తెలిస్తే...." రామనాథం ససేమిరా ఒప్పుకోలేదు.

"మొదట ఇంటర్వ్యూ కెళ్లు. అదృష్టం బాగుండి నీకు ఉద్యోగం రానీ. ఆ తర్వాత నిజం తెలిసినా కాళ్లూ చేతులూ పట్టుకుని బ్రతిమాలి, నీ కుటుంబ పరిస్థితులు చెప్పి ఉద్యోగం చేయిజారిపోకుండా చూద్దాం. దిగులు పడకు. ధైర్యంగా వెళ్లు" అని రామనాధానికి ధైర్యం చెప్పాడు రామచంద్రం.

* * *

**బు**ధవారం రానే వచ్చింది!

భగవంతునికి నమస్కారం చేసి, ఇంటర్వ్యూకు ధైర్యంగా బయలుదేరాడు 'రామచంద్రం' కాని రామనాథం.

'హరిశ్చంద్ర అండ్ కంపెనీ'లో అబద్ధాలు చెప్పడానికి తను వెళ్తున్నాడు. ఎంత విచిత్రం!

తన పేరు పిలవగానే ఇంటర్వ్యూ గదిలోకి వెళ్లాడు 'రామచంద్రం'. గది ఏ.సి. అయినా ఒళ్లు చమటలు పట్టాయి. వెళ్లగానే అక్కడి అధికారులకు విష్ చేశాడు.

టేబిల్‌కటువైపు మేనేజింగ్ డైరక్టర్ వేణుగోపాల్, సేల్స్ మేనేజర్ చంద్రశేఖర్, ఏరియా మేనేజర్ వెంకట్రావు కూర్చుని వున్నారు.

అప్లికేషన్‌ల ఫైలు చూస్తున్న సేల్స్ మేనేజర్ ఏదో అడగబోయాడు. కానీ అతణ్ణి కళ్లతోనే వారించిన మేనేజింగ్ డైరక్టర్ ఫైలు తను తీసుకుని, 'రామనాథాన్ని' 'మీపేరు' అని అడిగాడు.

"రామనా... సారీ... రామచంద్రం." అంటూ భయం, ఆందోళన, కంగారు - అన్నిటినీ కప్పిపుచ్చుకుని చెప్పాడు రామనాథం.

ఇంటర్వ్యూ పూర్తయింది. ఆరంభంలో కొంత తడబడినా, ఆక్షణంలో తనే 'రామచంద్రం' అనుకుని జవాబులిచ్చాడు రామనాథం.

చివర్లో 'ఓకే. మిస్టర్ రామచంద్రం! థాంక్యూ! అవసరమైతే మళ్లీ కబురు చేస్తాం!' అని చిరునవ్వుతో వీడ్కోలు చెప్పాడు వేణుగోపాల్!

ఉద్యోగం రాదని తెలిసినా ప్రయత్నలోపం జరుగలేదని తనను తనే సమాధానపరుచుకున్నాడు రామనాథం.

"ఊ! మొత్తానికి వాళ్లను బాగా మోసపుచ్చావన్న మాట! వాళ్ల ప్రశ్నలకు ఎన్ని నిజాలో, ఎన్ని అబద్ధాలో, ఆదేవునికే ఎరుక" అంటూ నవ్వుతూ మిత్రుణ్ణి అభినందించాడు రామచంద్రం!

* * *

**'పో**స్ట్'

కవరుచూసి ఆశ్చర్యపోయాడు రామనాథం! అది గతవారం తను 'రామచంద్రం'లా ఇంటర్వ్యూకి వెళ్లి వచ్చిన 'హరిశ్చంద్ర అండ్ కంపెనీ' నుంచి.

'కవరు రామచంద్రం పేరిట వచ్చిందా!' ఈమారు పరీక్షగా కవర్ని చూశాడు రామనాథం!'

'లేదు! అది తనపేరిటే వచ్చింది!' కవరు తెరిచి చూశాడు! అందులోనూ తనపేరేవుంది!

"ఇంటర్వ్యూలో తను చెప్పిన సమాధానాలు సంతృప్తి కరంగా వున్నాయని, తదుపరి విషయాలు మాట్లాడుకోవడానికి రమ్మనమని' అందులో వుంది!

'తను 'రామచంద్రం'గా ఇంటర్వ్యూ కెళితే రామనాథం పేరిట కవరెందుకు వచ్చింది. ఒకవేళ రామనాథానికే రావలసిన కవరైతే, ఇంటర్వ్యూకు వెళ్లింది 'రామచంద్రం'కదా!' ఏమీ అర్థం కాలేదు రామనాథానికి. రామచంద్రం పరిస్థితీ అలాగే వుంది.

'ధైర్యే సాహసే లక్ష్మి.' అనుకుంటూ మరునాడు 'హరిశ్చంద్ర అండ్ కంపెనీ'కి వెళ్ళాడు రామనాథం తన ఒరిజినల్ సర్టిఫికేట్లతో.

* * *

**"ప్లీ**స్ టేక్‌యువర్ సీట్ మిస్టర్ రామచంద్రం సారీ రామనాథం. 'చిర్నవ్వుతో ఆహ్వానించారు ఆ కంపెనీ మేనేజింగ్ డైరక్టర్ వేణుగోపాల్.

తన ఆటకట్టయిందని తెలిసిపోయిన రామనాథం, "సార్... నేను... అసలు జరిగిందేమంటే..." అంటూ తడబాటుతో చెప్పబోయాడు.

"నో! నో! మీరేం చెప్పనక్కరలేదు. నేను చెప్పింది వింటే చాలు. ఆనాడు అప్లికేషన్‌లో అభ్యర్థి ఫొటో అంటించిన విషయం మీరు మరిచిపోయినట్లున్నారు. రామచంద్రం... ఐ మీన్ **అసలు** రామచంద్రం సర్టిఫికెట్లు, వివరాలూ వగైరా మీరు కొంతవరకూ చెప్పగలిగినా, ముఖ్యంగా ఫొటో సంగతి మరిచారు..."

"సార్! మా కుటుంబ...."

"నో! నేను మాట్లాడేది వినండి! ఆరోజు మిమ్మల్ని చూడగానే అభ్యర్థి మారాడని తెలుసుకున్నాను. ఇంటర్వ్యూకు పిలువబడని అభ్యర్థుల ఫైల్లో మీ అప్లికేషన్, ఫొటో చూసి విషయం గ్రహించాను. సరి! ఈ నాటకం ఎంత దూరం సాగుతుందో చూద్దామని మా సేల్స్ మేనేజర్, ఏరియా మేనేజర్లను మాట్లాడవద్దని సైగ చేశాను. అందుకు వ్యక్తిగతంగా తగినట్లుగా మేం వేసిన ప్రశ్నలకు మీరిచ్చిన సమాధానాల్లో తొంభైశాతం అబద్ధాలు... అయినా అది తెలియనీకుండా ఎలాగో మేనేజ్ చేశారు."

"సార్!...."

"నో... లెట్‌మి కంప్లీట్. మాకు కావలసింది ఒక మంచి సేల్స్‌మన్. సేల్స్‌మన్ ఉద్యోగానికి కావలసింది లౌక్యం, మాట చాతుర్యం, ఆత్మవిశ్వాసం ఇవి ప్రదర్శించగల వ్యక్తి మంచి సేల్స్‌మన్ అవుతాడు. మాకు కావలసిన ఈ లక్షణాలు మీలో వున్నాయి. కాబట్టి మిమ్మల్ని మా కంపెనీలో సేల్స్‌మన్‌గా అప్పాయింట్ చేస్తున్నాము. ఇదుగో మీ అప్పాయింట్‌మెంట్ ఆర్డర్. విష్‌యు బెస్ట్ ఆఫ్‌లక్! కానీ యిలాంటి తిరకాసు పనులు యిక చెయ్యకండి సుమా!" అంటూ చిరునవ్వుతో మృదువుగా హెచ్చరించి, ఇంకా షాక్ నుంచీ తేరుకోని రామనాథంతో - కరచాలనం చేశారు 'హరిశ్చంద్ర అండ్ కంపెనీ' మేనేజింగ్ డైరక్టర్ వేణుగోపాల్.

□

## అఖిలభారత స్థాయిలో రజత పతకాలు పొందిన విద్యార్థినులు



రేచెర్ల రాణి



వి. సునీత

విద్యార్థినీ విద్యార్థులలో నెలకొని వున్న ప్రతిభను వెలికితీయుటకు దేశవ్యాప్తంగా జనవరినెలలో ఢిల్లీలో గల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జనరల్ నాలెడ్జ్ అండ్ లెర్నింగ్ సంస్థవారు నిర్వహించిన గణితం, సైన్సు జనరల్ నాలెడ్జ్ పరీక్షలలో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన కుమారి వి. సునీత జనరల్ నాలెడ్జ్‌లోనూ, కుమారి రేచెర్ల రాణి గణితశాస్త్రంలోనూ రజత పతకాలు గెలుపొందారు.

దేశవ్యాప్తంగా గల అన్ని ఇంగ్లీషు మీడియం పాఠశాలల నుంచి ప్రతి సంవత్సరం అనేకమంది ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ సంవత్సరం నరసాపురంలో గల "జాన్ సికిలే ఫౌండేషను" విద్యాసంస్థకు 8 రజత పతకాలు వచ్చాయి. ఇందులో 6 గురు బాలురు కూడా వున్నారు. కుమారి సునీత, కుమారి రాణీలు స్థానిక జె.యస్. ఎఫ్ పాఠశాల పదవ తరగతి విద్యార్థినులు.

—ఎల్. వెంకటరత్నం
నరసాపురం